www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231



For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి


ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 8 | 20-11-2023 | పుటలు : 4


## గ్రంథాలయ వేదము




"వాయువు ఎల్లవారికి ఎట్లు స్వాధీనమైయున్నదో జ్ఞానము కూడా అట్లు స్వాధీనము కావలయును ఉదకము ఎల్లవారికి ఎట్లు సేవ్యమై యున్నదో జ్ఞానము కూడా అట్లు సేవ్యమై ఉండవలెను.
సూర్యచంద్ర మండలములు తేజస్సు ఎల్లవారికి ఎట్లు సౌఖ్య ప్రదముగానున్నదో జ్ఞానము కూడా అట్లు సౌఖ్యప్రదము కావలయును"

– చిలకమర్తి లక్ష్మీనరసింహం.

## గ్రంథాలయ వారోత్సవాలు

(నవంబర్ 14 నుండి 21 వరకు)

శుభాకాంక్షలతో....

- నన్నయవాణి

# ఆదిత్య లో సౌత్ జోన్ కబడ్డీ పోటీలు విజయవంతం



సూరంపాలెం ఆదిత్య కళాశాల ప్రాంగణంలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ పోటీలు విజయవంతంగా ముగిసాయి. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల్లోని 113 యూనివర్సిటీలకు చెందిన సుమారు 1200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్. సతీష్ రెడ్డి తెలిపారు. ఈ పోటీలను మంత్రి రోజా, యాప్సీ చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి, నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు, జె.ఎన్.టి.యు.కె వీసీ ఆచార్య ప్రసాదరాజు ప్రారంభించారు.





నవంబర్ 26

భారత రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు!!

- నన్నయవాణి

# గ్రంథాలయ వారోత్సవాలకు హాజరైన వీసీ



రాజమండ్రి వంకాయలవారి వీధిలో శ్రీరామ బాల భక్త పుస్తక భాండాగారం (లైబ్రరీ1920)లో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య కె. పద్మరాజు హాజరయ్యారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మరియు బహుమతి ప్రదాన కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వీసీని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కోళ్ల అచ్యుతరామారావు, ఎస్. సూర్య మాణిక్యం, వెంకటేశ్వరరావు, సాయిరాం, కొల్లూరి గోపాలకృష్ణ, తీగెల రాజా తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా "గ్రంథాలయోద్ధారక, గ్రంథాలయ పితామహ, గ్రంథాలయ శాస్త్ర విశారద" శ్రీ అయ్యంకి వేంకట రమణయ్య గారికి అక్షర నీరాజనం!!

౨- నన్నయవాణి

# సంపాదకీయం



## మిమ్మల్ని అడిగిన పుస్తకం!

సురక్షితమైన అరలో,జ్ఞాన పిపాసి అరచేతిలో,చదువుతూ చదువుతూ నిద్రలోకి జారుకున్న జిజ్ఞాసి గుండెల మీద.... ఇవే పుస్తకం ఉండాల్సిన చోట్లు.నచ్చిన పుస్తకం కొంటున్నప్పుడు ఎంత ఆనందం కలుగుతుందో, కావాల్సిన పుస్తకం గ్రంథాలయంలో చేతికి దొరుకుతున్నప్పుడు కూడా అంతే ఆనందం కలుగుతుంది. అందులోనూ పునర్ముద్రణలేని అరుదైన పుస్తకం కనిపిస్తే ప్రాణం లేచొస్తుంది.పుస్తకప్రియులు కొన్నిటి కోసం పాత పుస్తకాల దుకాణం చుట్టూ తిరుగుతుంటారు.కొత్త వాటిని చిన్నబుచ్చే ఉద్దేశం కాదుగానీ పాత పుస్తకంలో ఓ దర్జా ఉంటుంది.ఆ పుస్తకాల సెల్ఫ్ కే అందాన్ని తెస్తుంది. కుర్రాళ్లంతా తలపండిన తాతగారితో సెల్ఫీ దిగినట్టుంటుంది.

'తుపాకీ కంటే పెద్ద ఆయుధం పుస్తకమే' అంటారు లెనిన్. పుట్టినరోజు కానుకగా మీకు ఏం కావాలని అడిగితే పుస్తకమన్నారాయన. ఒక పిల్లాడికి మీరు ఇవ్వాల్సిన గొప్ప బహుమతి ఏమిటంటే 'పుస్తకమే' అంటారు చర్చిల్.

వెయ్యేళ్ల క్రితమో, ఐదారు దశాబ్దాల క్రితమో ఒక మహానుభావుడు తన జీవితానుభవాలను రంగరించి సృజనతో ఒక పుస్తకంగా, అది కథగానో,నవలగానో, కవిత్వంగానో రాసుకుని ఉంటాడు.కష్టపడ్డ సొమ్ముతోనో,తాతల ఆస్తి అమ్ముకునో అచ్చు వేయించి లోకానికి అందించి ఉంటాడు. అక్షరం మీద మమకారంతో ఏ ప్రచురణకర్తో సాహసం చేసి ఉంటాడు. కొన్నాళ్ళకి నీరు, నిప్పు,చెదలు తగిలి మాయమైనవి పోగా కాలపరీక్షకు తట్టుకుని మిగిలిన ప్రతులు వేళ్లమీద లెక్క కట్టేలా మిగులుతాయి.ఫలానా రచయిత ఆ పుస్తకం రాశాడని, అందులోంచి కొన్ని మాటలు తలపండిన పండితులు సభలో గుర్తు చేస్తారు. కొన్నాళ్ళకి అలా ఉటంకించేవారు కూడా కరువౌతారు. మెల్లగా ఆ పుస్తకం జ్ఞాపకాల్లోంచి మాయమై కొన్నాళ్ళకు శాశ్వత సమాధిని పొందుతుంది. ఇది తేలిగ్గా తీసుకునే విషయమా?గుండెలు బరువెక్కించే దుర్వార్త! సహజ మరణం కాదిది. సమాజం తరపున శ్రద్ధాంజలి కూడా కాదు.అక్షరాలా అశ్రద్ధాంజలి!!

నిజంగా ఒక అరుదైన పుస్తకం దొరికితే 'ఖరీదు కట్టే షరాబు లేడు' అన్నట్లుగానే ఉంటుంది.రంగువెలసినా బంగారు తల్లిలా తళ తళ మెరుస్తుంది. 'నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా' పాత పుస్తక ప్రియులకు ఒక వరమనే చెప్పాలి. 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్పూర్' దీన్ని రూపొందించింది. ఇందులో చాలా తెలుగు పుస్తకాలు అప్లోడ్ చేశారు. మనసు ఫౌండేషన్ రాయుడుగారు ఎన్నో మంచి పుస్తకాల్ని తీసుకొస్తూ ఒక ప్రయత్నం చేస్తున్నారు. అరుదైన పుస్తకాల్ని పిడిఎఫ్ చేసి పెడతారు. మనకు అవసరం లేదనుకున్న పుస్తకం మరొకరికి అవసరమవుతుంది. రాజమహేంద్రి గౌతమీ గ్రంథాలయంలో ఎన్నో అరుదైన పాఠ్యపుస్తకాలను 'తెలుగు వెలుగు'అరిపిరాల నారాయణరావుగారు స్కాన్ చేయించి పిడిఎఫ్ ప్రతులుగా మార్పించే భద్రతా ఉద్యమంలో ఉన్నారు.తెలుగుతల్లి తోటమాలి లంకా సూర్యనారాయణగారు సేకరించిన గుంటూరులోని అన్నమయ్య గ్రంథాలయం ఎంత గొప్పదో. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి దాతలు ఇచ్చిన పదిహేనువేలకుపైగా పుస్తకాల్ని నన్నయభారతి పేరుతో ఒక విభాగాన్ని ఏర్పాటు చేశారు.పుస్తక పఠనాన్ని, పుస్తక దానాన్ని ప్రోత్సహించే ఉద్యమాలివి.

పుస్తకాలకోసమే టెలిగ్రామ్, వాట్స్ యాప్ గ్రూపులు బోలెడంత సేవ చేస్తున్నాయి.మాకు ఈ పుస్తకం కావాలని అడిగితే కాసేపట్లో మొబైల్లో ప్రత్యక్షమౌతుంది.

పుస్తకాలు కాలసాగర తీరాన దారి చూపే లైట్ హౌసులని,అనర్ఘ కోశాగారాలని,ఆత్మకి ఔషధాలనీ అంటారు పొన్నపల్లి శ్రీరామారావు గారు. ఏదేమైనా కొత్త పుస్తకం కొత్త స్నేహితుడయితే పాత పుస్తకం పాత బంధువే! పుస్తకాన్ని మనం వెతకడం కాదు.అదే మనల్ని వెతుకుతోంది. ఓసారి మీరు కనిపించండి.


# సరస్వతీ సామ్రాజ్యం

13 డిసెంబర్ 1942 తేదీన గుంటూరులో జరిగిన ఆంధ్రదేశ గ్రంథాలయ సేవక చతుర్ధ మహా సభలో సమర్పించిన అయ్యంకి వెంకటరమణయ్య గారి సన్మాన సంచికయే సరస్వతీ సామ్రాజ్యం. దీనికి ప్రదాత డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి. ప్రముఖ కవులు, రచయితలు రచించిన 25 వరకు పద్య, గేయ ఖండికలు 85 తెలుగు సారస్వత, గ్రంథాలయ వ్యాసాలు ఇందులో ఉన్నాయి. 700 పేజీలతో కాలికో బైండింగ్ గా ప్రచురించిన గొప్ప గ్రంథమిది. మామిడిపూడి వెంకట రంగయ్య , మల్లంపల్లి సోమశేఖర శర్మ , బెల్లంకొండ రాఘవరావు సంపాదకులు. సన్మాన సంచిక ప్రారంభకులు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రోఛాన్సలర్ జయపురం మహారాజు శ్రీ విక్రమదేవ వర్మ గారు. ఈ అరుదైన గ్రంథంలో కోరాడ రామకృష్ణయ్య, పిలకా గణపతి శాస్త్రి, నిడదవోలు వెంకటరావు, జమ్మలమడక మాధవరాయ శర్మ, చెళ్ళపిల్ల వెంకట శాస్త్రి, కాకర్ల వెంకట రామ నరసింహం, దువ్వూరి వెంకట రమణ శాస్త్రి, దివాకర్ల వెంకటావధాని, కవికొండల వెంకటరావు, నండూరి రామకృష్ణమాచార్యులు,బండారు తమ్మయ్య, పైడిపాటి సుబ్బరామ శాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, పుట్టపర్తి నారాయణాచార్యులు, చాగంటి శేషయ్య, జటావల్లభుల పురుషోత్తం వంటి మహనీయుల వ్యాసాల పరంపరతో అరుదైన గ్రంథంగా దీనిని ప్రచురించారు. గ్రంథాలయ ఉద్యమం,తెలుగు నాట పుస్తక భాండాగారాల ఏర్పాటు, గ్రంథాలయోద్యమం కోసం అయ్యంకి వెంకటరమణయ్య గారి కృషి వారితో పాటు ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల పరిశ్రమ వంటి విషయాలతో, విలువైన సాహిత్య వ్యాసాలతో ఈ సరస్వతీ సామ్రాజ్యం సంచికను కట్టమంచి రామలింగారెడ్డి గారు ప్రచురించారు. అరుదైన ఈ గ్రంథం లోని విషయాలు ఇప్పుడున్న తెలుగు తరాలకు తెలియవలసిన అవసరం కూడా ఉంది. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సరస్వతీ సామ్రాజ్యం పుస్తక విశేషాలు నన్నయ వాణి ద్వారా తెలియజేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

**- పోతుల శివాజి,**
పరిశోధక విద్యార్థి.నన్నయ విశ్వవిద్యాలయం.

## పుస్తకం




సరస్వతీసామ్రాజ్యమ్
అయ్యంకి వేంకటరమణయ్యగారి
సన్మాన సంచిక
డాక్టర్ సర్ కట్టమంచి రామలింగారెడ్డి
కె. టి. ఎం. ఏ., (కేంటబ్) డి. లిట్., ఎం. ఎల్ సి. గారిచే
13-12-42 తేదీన గుంటూరునందు
ఆంధ్రదేశ గ్రంథాలయ సేవక చతుర్థ మహాసభయందు సమర్పింపబడినది.
వ్యాసములు - సందేశములు గల 700 పుటల సంపూర్ణగ్రంథముయొక్క విలువ రు. 20 లు
సరస్వతీ సామ్రాజ్యమ్, దివ్యజ్ఞాన సమాజ భవనములు,
విజయవాడ - 2.

# ఇండస్ట్రీ 4.0 మార్కెటింగ్ ట్రెండ్స్‌పై జాతీయ సదస్సు




ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ నందు డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన ఇండస్ట్రీ 4.0 మార్కెటింగ్ ట్రెండ్స్ అనే జాతీయ సదస్సును హెచ్ ఓ డి డాక్టర్ డి అజయ్ రతన్ సమన్వయకర్తగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ ప్రశాంతిశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి .సుధాకర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత నవయుగం సాంకేతిక పరిజ్ఞానం తో ముడిపడి ఉందని, ప్రతి ఒక్క విద్యార్థి ఈ టెక్నాలజీ ని ఒక అవకాశం గా భావించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెటింగ్ ట్రెండ్స్ గూర్చి కేఎల్ యూనివర్సిటీ మేనేజ్మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ ఎం కిషోర్ బాబు ముఖ్య వక్త గా పాల్గొనారు. ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రీ 4.0 కొత్త నవసక పారిశ్రామిక అభివృద్ధి వీటిలో సాంకేతిక పరిజ్ఞానం ప్రమోషనల్ టెక్నిక్స్ ప్రైసింగ్ స్ట్రాటజీస్ ఒక కొత్త ప్రోడక్ట్ని ఏవిధంగా లాంచ్ చేయాలి అండ్ ఈ కొత్త పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఏ విధమైన మార్కెటింగ్ అంశాలను చేయాలి అనే విషయాలపై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కాకినాడ చుట్టుపక్కల ఉన్న వివిధ కళాశాల నుండి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్యాంపస్ డిసిఎంఎస్ అధ్యాపకులు డా.ఎం.శ్రీరామరాజు, డా.కె.అనిలాంబిక, డా.ఎల్.మధు కుమార్,కే. మణికంఠేశ్వర్ రెడ్డి, డా.ఈ.అప్పారావు, డా. శ్రీదేవీ, డా. పి.ఉమా రజిత తదితరులు పాల్గొన్నారు.

# సిటిఆర్ఐతో నన్నయ ఒప్పందం










కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ తో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గురువారం స్థానిక సిటిఆర్ఐ సెమినార్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిటిఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం శేషు మాధవ్, వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్ హాజరై ఒప్పంద పత్రాల పై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా శేషు మాధవ్ మాట్లాడుతూ సిటిఆర్ఐ ఆధ్వర్యంలో ఇటీవల కాలంలో సాధించిన పరిశోధనా ప్రగతి మరియు సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఎం ఓ యు ద్వారా సిటిఆర్ఐ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అధ్యాపకులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. విద్య పరిశోధన ప్రాజెక్టులు వంటి అంశాలలో సంయుక్తంగా పనిచేయడానికి ఈ అవగాహన ఒప్పందం దోహదపడుతుందని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సాధించిన అభివృద్ధి అంశాలను తెలియజేశారు అలాగే ఉమ్మడి గోదావరి జిల్లాలోని సుమారు 400 అనుబంధ కళాశాలలో లక్షకు పైగా మంది విద్యార్థులతో చేస్తున్న కార్యక్రమాలు వివరించారు. వీసీ ఆచార్య కె పద్మరాజు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న రెండు పెద్ద సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదరడం ద్వారా సంస్థలకు మరియు సమాజానికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఆదికవి నన్నయ యూనివర్సిటీ, జేఎన్టీయూకే, ఎన్ ఐ టి తాడేపల్లిగూడెం, డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ లు కలిసి క్లస్టర్ యూనివర్సిటీ గా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. సి టి ఆర్ ఐ ఆధ్వర్యంలో నన్నయ యూనివర్సిటీ వేదికగా త్వరలో అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నామని తెలియజేశారు. విశ్వవిద్యాలయ అధికారులు డాక్టర్ కె రమణేశ్వరి, ఆచార్య కె శ్రీ రమేష్, ఆచార్య పి సురేష్ వర్మ, ఆచార్య వై శ్రీనివాసరావు, డాక్టర్ వి. పెర్సిస్, డాక్టర్ పి విజయనిర్మల డాక్టర్ పి వెంకటేశ్వరరావు, డాక్టర్ బి జగన్మోహన్ రెడ్డి, సిటిఆర్ఐ విభాగ అధిపతులు డాక్టర్ కె సరళ డాక్టర్ కె రాజశేఖరరావు, డాక్టర్ ఎల్.కె. ప్రసాద్, డాక్టర్ హెచ్ రవిశంకర్ మరియు సంస్థ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



కాకినాడ కోరంగి ప్రాంతాలను సందర్శించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థులు, అధ్యాపకులు





అడ్డతీగలలోని వనమూలిక మొక్కల ప్రదర్శన కు హాజరైన నన్నయ యూనివర్సిటీ బోటనీ విద్యార్థులు అధ్యాపకులు


# నన్నయ భారతికి గ్రంథ బహూకరణ



గ్రంథాలను అందిస్తున్న డా.వెంకటేశ్వర్లు దంపతులు,మోదుగుల రవికృష్ణ

గుంటూరుకు చెందిన ప్రముఖ సాహితీవేత్తలు డా.భూసురుపల్లి వెంకటేశ్వర్లు,డా.మోదుగుల రవికృష్ణ విలువైన తెలుగు సాహిత్య గ్రంథాలను నన్నయ భారతి కో ఆర్డినేటర్ డా.తలారి వాసుకు అందించారు. వీటిలో తెలుగు కవిత్వం,సాహిత్య విమర్శ, సంగీతం, జీవిత చరిత్రలకు సంబంధించినవి 80 గ్రంథాలు ఉన్నాయని సాహిత్య విద్యార్థులకు,పరిశోధకులకు ఎంతగానో ఉపయోగమని వాసు అన్నారు.విలువైన గ్రంథాలను నన్నయ విశ్వవిద్యాలయానికి అందించినందుకు వీసి ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ సాహిత్య ప్రముఖులకు కృతజ్ఞతలు తెలియజేశారు.






## మంచిమాట

చేయబోయే పనిని తెలిసుకోవటమే వివేకం.
దానిని ఎలా చేయాలో తెలుసుకోవటం నైపుణ్యం.
దానిని పూర్తి చేయటం సద్గుణం!!

- డి.ఎస్. గోర్టన్

# వనసమారాధనకు హాజరైన వీసీ పద్మరాజు



ఆదివారం బొమ్మూరు నుండి కేశవరం వెళ్లే రోడ్డులో సంపత్ నగరం ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ నందు రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి ఏర్పాటుచేసిన కార్తీక మాస వన సమారాధన మహోత్సవం కార్యక్రమం స్కూలు ఆవరణలో ఉన్న విఘ్నేశ్వరుని గుడి దగ్గర పూజలు కావించి తర్వాత స్కూలు గోశాలలో గోమాతకి పూజలు చేసిన తర్వాత కొత్తగా ప్రతిష్టించిన ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు చేసి చివరగా ఉసిరి చెట్టు దగ్గర విద్యాసంస్థల డైరెక్టర్ తేతలి స్వరూపరెడ్డి,సత్య సౌందర్య పూజలుతో ఈ కార్తీక వన సమారాధన మహోత్సవ ప్రారంభం జరిగింది. కార్తీక సమారాధన వనమహోత్సవ కార్యక్రమాన్ని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీ.కే. విశ్వేశ్వర రెడ్డి ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కె. పద్మరాజు ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ ఈరోజుల్లో మొబైల్ ఫోన్స్ వాడకం ప్రతి ఒక్కరిలో ఎక్కువైందని దానివలన మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని ప్రతి ఒక్కరికి మొబైల్ తోనే సరిపోతుందని అందువలన మొబైల్ వినియోగాన్ని తగ్గించాలని చెప్పి, పది పదిహేను సంవత్సరాలు ఎక్కువగా మొబైల్ వాడినట్లయితే పిల్లలు కూడా పుట్టకుండా ఉండడం జరుగుతుందని నపుంసకత్వం వస్తుందని మైండ్ అంతా చెడిపోతుందని, నలుగురు కలిపి కూర్చొని మాట్లాడుకునే విధంగా ఉండాలని చెబుతూ ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరితో మాట్లాడుకుని మానవ సంబంధాలు బాగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, డి.సి.సి.బి. చైర్మన్ ఆకుల వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ కందులు దుర్గేష్, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ స్టేట్ డైరెక్టర్ కాను బోయిన సాగర్, గౌతమి జీవ కారుణ్య సంఘం చైర్మన్ బర్రె కొండబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ వన భోజనానికి వచ్చిన పిల్లలకి, పెద్దలకి ఆటల పోటీలు మరియు వివిధ రకాల పోటీలు పెట్టి గెలిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యార్థులు వేసిన నృత్యరూపకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



# ఆదిత్య విద్యార్థులకు వీసి సందేశం

సూరంపాలెంలో ఉన్న ఆదిత్య కళాశాలలో జరిగిన ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య కె. పద్మరాజు హాజరయ్యారు. వర్తమాన సమాజానికి ఉద్యోగ అవకాశాలకి తగిన విధంగా విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ మరిన్ని నైపుణ్యాలను సంపాదించుకుంటూ విద్యార్థులు తమకు నచ్చిన రంగాల్లో స్థిరపడడానికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సందేశాన్ని ఇచ్చారు.




# నవంబర్ గ్రంథాలయ వారోత్సవాలు

ఒక కోటి రూపాయలు మీకు దొరికితే మీరేం చేస్తారు అని అడిగితే ఒక గ్రంథాలయాన్ని కట్టేస్తా అన్నారు. - మహాత్మగాంధీ

ఎవరూ లేని ఒక దీవిలో మిమ్మల్ని ఒంటరిగా వదిలేస్తే ఏమి చేస్తారు అని అడిగితే
పుస్తకాలతో ఆనందంగా గడిపి రెట్టింపు సంతోషంతో తిరిగి వస్తా అన్నారు.- నెహ్రూ

మరిచిపోకుండా నా సమాధిపైన రాయండి ఇక్కడ పుస్తకాల పురుగు శాశ్వత నిద్రలో ఉన్నదని అన్నారు.
- ఫ్రెడ్రంట్ రసెల్

మానవుడు సృష్టించిన వాటిలో గొప్పది ఏది అన్నప్పుడు కొంచం కూడా ఆలోచించకుండా పుస్తకం అని చెప్పారు.
- ఆల్బర్ట్ ఐన్స్టెయిన్

ఇంకే స్వేచ్ఛ నాకు వద్దు జైలులో పుస్తక పఠనానికి అనుమతి కావాలని కోరారు
-నెల్సన్ మండేలా

తుపాకీ కంటే పెద్ద ఆయుధం,పుస్తకం అన్నారు .
పుట్టినరోజు కానుకగా ఏమి కావాలని కోరినప్పుడు పుస్తకాలు కావాలని కోరుకున్న వ్యక్తికి లక్షల పుస్తకాలు వచ్చి పడ్డాయంటా కానుకగా ఆ వ్యక్తి - లెనిన్

ఒక్కో చిత్రం నటించాక తనకు వచ్చిన పారితోషికంతో మొదట 100 డాలర్లకు పుస్తకాలను కొనేవారు.
-చార్లీ చాప్లిన్

ఒక పిల్లాడికి మీరు ఇవ్వాల్సిన గొప్ప బహుమతి ఏది అంటే పుస్తకమే అన్నారు.
- విన్స్టెన్ చర్చిల్



భయంకరమైన యుద్ధ ఆయుధాలు ఏవి అని అడిగినప్పుడు పుస్తకాలని చెప్పారు.
-మార్టిన్ లూథర్ కింగ్

తనకు ఉరివేసే క్షణం ముందు వరకు పుస్తక పఠనం చేస్తూ ఉన్న వ్యక్తి.
- భగత్ సింగ్

నేను ఇంతవరకు చదవని పుస్తకాన్ని తీసుకువచ్చి నన్ను కలిసినవ్యక్తి నా ప్రాణ స్నేహితుడవుతాడు అన్నారు.
- అబ్రహం లింకన్

వెయ్యి పుస్తకాలు చదివిన వ్యక్తి ఉంటె చూపండి, అతడే నా మార్గదర్శి అన్నారు.
-జూలియస్ సీసర్

ప్రపంచపటంలో కనిపించే ప్రతి మూలకు వెళ్లాలని ఆశపడుతున్నావా, అయితే గ్రంథాలయానికి వెళ్ళమన్నారు.
-టెస్కార్డ్స్

జీవితం విరక్తి చెందినప్పుడు లేదాకొత్త జీవితం ప్రారంభించాలి అనుకున్నప్పుడు ఒక మంచి పుస్తకం చదివి మొదలుపెట్టు అన్నారు.
-ఇంగర్సాల్

వ్యాయామం ఎలా శారీరక ఆరోగ్యమో, అలా పుస్తక పఠనం మనసుకు వ్యాయామం ఆరోగ్యం అన్నారు.
-సిగ్మెంట్ ఫ్రాయిడ్

పుస్తక పఠనం అలవాటు ఉన్న వ్యక్తిని పరిపూర్ణ మనిషిగా మార్చేస్తుంది పుస్తకం అంటారు.
ప్రముఖుల ఎందరికో వెలుగు పంచింది. వారిని వెలుగులోకి తెచ్చింది పుస్తకాలే.
చదవాలి అనే ఆలోచన,ఆసక్తి ఉంటె చాలు ఎన్నో మంచి పుస్తకాలు వేలల్లో ఉన్నాయి చదవండి, చదివించండి.

**నన్నయ భారతి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయం,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in